
# సింగిల్ పేజీ కథలు

## జీవితమే ఓ చదరంగం

వడివడిగా దాదాపు పరుగెడుతోన్నట్లుగా నడుస్తోంది రంగి. దాని మనసు మనసులో లేదు. పనిలో నుంచి సాయంత్రం ఇల్లు చేరేసరికి చంటిది మూసిన కన్ను తెరవకుండా పడుకునుంది. మధ్యాహ్నం నుంచీ ఇలాగే ఉందని చెప్పింది రంగి మామ్మ. తను పనిచేసే ఇంటి అమ్మగారిని డబ్బు అడిగి చంటిదాన్ని డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాలని అనుకుని అమ్మగారింటి వైపు వెళుతోంది. ఆలోచనల్లు సాగుతూనే ఉన్నాయి.



కొత్తకోడలుగారు మొన్నే వచ్చారు. పెళ్ళయి సంవత్సరం పైనే అయినా ఇన్నాళ్ళూ అమ్మగారు పుట్టింట్లోనే ఉన్నారు. చదువుకుంటున్నది పరీక్షలు అయాక తీసుకొస్తాం అని పెద్దమ్మగారు అందరికీ చెప్తుంటారు. పెద్దోళ్ళు అలాగే చెప్తారు కట్నకానుకల్లో గొడవలొచ్చి ఇన్నాళ్ళూ కోడలిని తీసుకురాలేదు అని అమ్మలక్కలు అనుకోగా వింది.

కోడలమ్మగారు కుందనం బొమ్మలాగా ఉంటారు. ఇంత ఆస్తులు, మేడలు ఉన్నోళ్ళు కూడా పరోళ్ళ సొమ్ము కట్నం కోసం ఎందుకు ఆశపడతారో అనుకుంది.

ఇంతలో ఇల్లు రాగానే తన ఆలోచనలకు బ్రేక్ వేసి మెయిన్ గేటు తీసుకుని లోనికి వెళ్ళింది. అయ్యగార్లు ఇద్దరూ వచ్చేసినట్లున్నారు. స్కూటర్లు రెండూ ఉన్నాయి. అనుకుంటూనే వేసి ఉన్న హాలు యొక్క తలుపు తీయబోతూ 'షాక్' కొట్టినట్లుగా ఆగిపోయింది.

అప్పుడే లోపలి నుంచి 'చంపు', 'చంపు' అని గట్టిగా పెద్దమ్మగారి గొంతు విని, ఈసారి కొయ్యబారి పోయింది భయంతో. "చంపెయ్యరా ఇంకా ఆలోచిస్తావేం" అంటున్నారు అయ్యగారు. రంగికి అంతా అయోమయంగా అనిపించింది.

మెరుపులా ఆలోచన మెరిసి వెంటనే అలర్టయ్యింది. అయితే కోడలుగారిని చంపేస్తున్నారన్నమాట. టి.వి.లో చూడటం పేపర్లలో చదవడమే కానీ ఇలాంటివి ఇప్పుడే చూస్తోంది. ఎంత మంచి మనుష్యుల్లా ఉంటారు. పైకి అమ్మో వీళ్ళింత రాక్షసులా? నమ్మలేకపోతోంది. ఎలా? ఏదైనా చెయ్యాలి చిన్నమ్మగారిని రక్షించాలి అనుకుని చాలా స్పీడ్‌గా ఆలోచించి ఇంటి ప్రక్కకు పరుగెత్తి బెడ్‌రూం కిటికీలు తీయడానికి ట్రై చేసింది. రాలేదు. మళ్ళీ ఇంటి వెనక్కి పరుగెత్తి వెళ్ళి నిచ్చెన తెచ్చుకుని బెడ్‌రూం వెంటిలేటర్ దగ్గరకు ఎక్కి అందులోంచి చూద్దానికి ట్రై చేసింది. కానీ కనిపించలేదు. కిటికీలన్నీ బిగించి ఉన్నాయి.

ఈసారి మళ్ళీ చిన్నమ్మగారు కెవ్వుమన్న కేక వినిపించింది.

మళ్ళీ 'చంపెయ్, చంపెయ్' అన్న అరుపులు వినిపించాయి.ఇక క్షణం ఆలస్యం చెయ్యకుండా ఇంటి వెనక్కి పరుగెత్తికెళ్ళి వంటగది తలుపులు తోసింది. రాలేదు.

వంటమనిషిని కూడా పంపించేసి ఉంటారు. వంటగది కిటికీలు బలంగా తోసింది అవీ రాలేదు. ఆ ప్రక్కకు వెళ్ళి బెడ్ రూం కిటికీలు, అన్ని గదుల కిటికీలు బలంగా తోస్తూ వెళ్ళింది. ఆఖరికి డైనింగ్ హాలుకి ఉన్న కిటికీ ఒకటి వచ్చింది. అందులోంచి పెద్ద హాలు కనిపిస్తోంది.

అక్కడ కనిపించిన దృశ్యం చూసి ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని ఉండిపోయింది రంగి.అక్కడ- పెద్దయ్యగారు, పెద్దమ్మగారు సోఫాలో కూర్చుని ఉన్నారు. ఒక కుర్చీలో చిన్నయ్యగారు, ఎదురుగా ఉన్న కుర్చీలో చిన్నమ్మగారు కూర్చుని ఉన్నారు. మధ్యలో టీపాయ్ వుంది. అందరూ టీపాయ్ పైకి వంగి దీక్షగా చూస్తున్నారు. టీపాయ్ పై నలుపు, తెలుపుల బొమ్మలేవో వున్నాయి. అదేదో ఆడుతున్నారని మాత్రం అర్థం అయింది రంగికి.

ఎప్పుడూ వాటిని చూడకపోవడం వలన ఇంతపార్థానికి దారి తీసింది.

కళ్ళు విప్పార్చుకుని, నోరు తెరుచుకుని అలా ఎంతసేపుందో పాపం రతి.

ఇప్పటికే మీకు అర్థం అయే ఉంటుంది కదండీ! వాళ్ళంత ఆసక్తిగా ఆడేది 'చెస్' అని, 'చదరంగ'మని.

**-పి.అమరజ్యోతి**

(అనకాపల్లి)

★ ★ ★

## కాంప్లిమెంట్

"ఆమె పేరు నాకు తెలియదు. కానీ మంచుబిందువులకి తడిసిన తెల్లగులాబిలా, అయిదున్నరడుగుల మంచి ముత్యానికి బట్ట కట్టినట్టూ, కోలగా ఉన్న చందమామకి నేరేడు పళ్లు లాంటి కళ్లు, సంపెంగ లాంటి ముక్కు, ఎర్రటి గులాబిరేకుల్లాంటి తీరైన పెదవులూ, అజంతా శిల్ప ఆకృతికి జీవం పోసినట్టూ, అందానికే అందంలా ఉంటుందిరా నా హృదయ చోరురాలు" అని అవినాష్ మరలా ఏదో చెప్పబోయేంతలో.

"చాలు, చాలు. గంట నుంచీ ఇలాగే నీ భాషాపరిజ్ఞానంతో నా చెవుల్లో కందిరీగలా పోరి, కుమ్మరి పురుగులా తొలిచి, నా కర్ణభేరి పారని చించేస్తున్నావ్. నీకు నా మీద ఏ మూలైనా జాలి, దయా మిగులుంటే నన్నొదిలేసి ఆ కాఫీ రెస్టారెంట్‌లో చూసిన అమ్మాయితోనే ఐ లవ్ యు అని చెప్పి తగలడు" చిరాకు పడ్డాడు సుధాకర్.

"చెప్పొచ్చు. కానీ ఆమె ఎలా రియాక్ట్ అవుతుందో"? శూన్యంలోకి చూస్తూ సందేహం వెలిబుచ్చాడు మధు.

"అలా అని చెప్పకుండా నువ్విలా కాలయాపన చేస్తే, ఈ లోపు ఆ అమ్మాయికి వేరెవరైనా ప్రపోజ్ చెయ్యొచ్చు. లేదా ఆమెకి పెళ్లి కుదరొచ్చు, అదీ కాదంటే ఆ అమ్మాయే నీకు కనబడకుండా పోవచ్చు. అప్పుడు నువ్వు నా దగ్గరకొచ్చి గుక్కపట్టి ఏడ్చినా, నన్ను దుఃఖ పెట్టి చంపినా ఆ అమ్మాయి జాడ కాదు కదా కనీసం ఆమె జాడ కూడా దొరకదు" చెప్పాడు సుధాకర్.

"అంటే నువ్విప్పుడు అనేదేంటి!" స్వరం పెంచాడు అవినాష్.

"ఏముంది! ఈ రోజే నీ మనసులోని మాట ఆమెకి చెప్పి తాడో పేడో ఆ అమ్మాయితో నీ ప్రేమ పండుతుందో, పుచ్చుతుందో ఈరోజే, నేడే, టుడే, ఆ డే తెల్సుకో. ఇదే నీ బెస్ట్ ఫ్రెండ్‌గా నేనిచ్చే సలహా" చెప్పాడు సుధాకర్ ఉత్సాహంగా అవినాష్ భుజం తడుతూ.

ఆ సలహా అవినాష్‌కి బాగా నచ్చింది. విన్నదే తడవుగా చిప్పలాంటి ముఖాన్ని అల్చిప్పలా విప్పార్చాడు.

రోజూ కన్నా ఆ రోజు సాయంత్రం కొంచెం ముందరగా నిద్రలేచి, తొందరగా బయల్దేరి కాఫీ రెస్టారెంట్‌కి చేరుకున్నాడు. అతను కూర్చున్నది ఏడో నెంబర్ టేబుల్ లోనైనా అతను ఎడతెరిపి లేకుండా చూస్తున్నది మాత్రం, ఆమె రోజూ కూర్చునే పద్నాలుగో నెంబర్ టేబుల్‌నే.

ఇంతలో ఇంద్రధనుస్సు మధ్య మెరుపు తీగలా తన స్నేహితురాళ్లతో నడిచి వచ్చి, పద్నాలుగో నెంబర్ టేబుల్‌లో కూర్చుని చుట్టూ ఉన్న పరిసరాల్ని ఓసారి కలియజూస్తూ అప్రయత్నంగా అవినాష్ వంక ఓ రెండు సెకన్లు చూపు నిలిపి, తరువాత తన స్నేహితురాళ్లతో మాటల్లో మునిగిపోయింది షర్మిళ.

అవినాష్ మాత్రం ఆమె వంకే చూస్తూ తన మనసులో మాట చెప్పాలని ఒక్క ఉదుటున పైకి లేచాడు. అదే సమయంలో తన గుండెవేగం రెట్టింపైన విషయం కూడా అతను గ్రహించాడు. వేగంతో కూడిన నడకతో ఆమెకి దగ్గరగా వెళ్లి నేరుగా ఆమె కళ్లల్లోకి చూస్తూ, కాస్త బిడియంగా "హాయ్. నా పేరు అవినాష్ నేను మెడిసిన్ ఫైనలియర్ చదువుతున్నాను." చెప్పాడతను.

"యస్. చెప్పండి అవినాష్" అందామె అనునయంగా నవ్వుతూ.


ఆమె చిరుమందహాసం చూసిన అతను ఓ క్షణం పాటు కొయ్యబారినా, మరో అరక్షణంలోనే తేరుకుని "మిమ్మల్ని గత వారం రోజులుగా గమనిస్తున్నాను. మిమ్మల్ని చూసిన ప్రతీసారీ నా మనసు పిండేస్తున్న ఫీలింగ్. మీతో మాట్లాడాలని, మిమ్మల్నే చూడాలని, ఎందుకో తెలీదు. కానీ మీరు నాకు నచ్చారు. ఇదే ప్రేమైతే నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను" చెప్పాడు నిర్భయంగా.

అప్పటివరకూ షర్మిళ పెదవులపై ఉన్న నవ్వు మాయమైంది. ఆమె చుట్టూ ఉన్న స్నేహితురాళ్లు అవినాష్‌ని రెప్పార్పని చూపుతో, ఒకింత ఆశ్చర్యంతో చూస్తుండిపోయారు. వాళ్లలో ఒకామె చక్రాల్లాంటి తన కళ్లు షర్మిళ వైపు ఫోకస్ చేస్తూ "చూశావా ఇప్పటికయినా ఒప్పుకుంటావా" అందామె.

ఆ మాటలు అర్థంకాని అవినాష్, షర్మిళ వంక క్వశ్చన్‌మార్క్ ఎక్స్‌ప్రెషన్‌తో చూస్తుండిపోయాడు.

ఆ చూపులకి అర్థం గ్రహించిన షర్మిళ "సారీ మిస్టర్ అవినాష్ నాకు పెళ్లై అయిదేళ్లవుతోంది. ఇద్దరు పిల్లలు కూడా" అని ఆమె చెప్పగానే, గుండెని ఎవరో గట్టిగా పిడికిట బిగించినట్టయిందతనికి. అయినా నిబ్బరంగా ఆమె మాటలు వినసాగాడు.

"నా ఆఫీస్ అవర్స్ అయిపోయాక ఇలా నా ఫ్రెండ్స్‌తో కల్సి ఈ రెస్టారెంట్‌కి రావడం పరిపాటే. అయితే ఓ వారం క్రితం నా ఫ్రెండ్స్ నాకో 'కాంప్లిమెంట్' ఇచ్చారు. అదేంటంటే, నాకు పెళ్లై పిల్లలున్నా నాలో ఇంకా చరిష్మా తగ్గలేదట. అలాగే నేను చీరల్లో కాకుండా మోడర్న్ డ్రెస్‌లో బయటికి వస్తే ప్రిన్స్ లాంటి అబ్బాయి నాకు ఐ లవ్ యు చెప్పేస్తాడన్నారు. నేనా మాటలు ఒప్పుకోలేదు. వీళ్ల బలవంతంపై ఓ వారం నుండి ఇలా ఈ డ్రెస్సుల్లో ఆఫీస్‌కి రావడం జరుగుతూండడంతో మీరు నా ఫ్రెండ్స్ ఇచ్చిన కాంప్లిమెంట్‌ని ఇలా నిజం చేసేశారు. అందుకు మీకు థాంక్స్. కానీ నేను మిమ్మల్నేమైనా డిస్టర్బ్ చేసుంటే మాత్రం అయామ్ సారీ" అని పైకి లేచి, తనదైన సోయగపు నవ్వుని పెదాలపై చిందిస్తూ, రాజహంస నడకతో అక్కడి నుంచి వెళ్లిపోయింది షర్మిళ.



అవినాష్ మాత్రం చెమర్చిన కళ్లతో, షర్మిళ నడిచి వెళ్లిపోయిన వైపే దీర్ఘంగా చూస్తుండిపోయాడు.

**-గంగాధర్ వడ్లమన్నాటి**

(విశాఖపట్నం)

★ ★ ★

# మనవడి ఉత్తరం

"పోస్ట్"

పోస్ట్‌మేన్ కేక విని వైదేహమ్మగారు ఆశ్చర్యపోయారు. నెమ్మదిగా లేచి ఓపిక తెచ్చుకుని గేటు దగ్గరికెళ్లి "బాబూ..ఉత్తరం నాకేనా సరిగా చూడు" అన్నారు.

"వైదేహిగారు అంటే మీరేనా?"

"ఆ.."

"అయితే ఇది మీదే.." అని పోస్ట్‌కార్డ్ చేతిలో పెట్టి రివ్వున సైకిల్ తొక్కుకుంటూ వెళ్లిపోయాడు.

ఆవిడ మనసులో రకరకాల ఆలోచనలు. 'తనకి ఉత్తరం రావడ మేమిటి? అసలు తనకెవరు రాస్తారని? ఎప్పుడో ఆయన బ్రతికి ఉన్నప్పుడు నెలల తరబడి క్యాంపుల కెళ్ళినప్పుడు ఉత్తరాలు రాసేవారు. ఆయన కాలం చేశాక...ఉన్న ఒక్కగానొక్క కొడుకు ప్రయోజకుడై..మరో రాష్ట్రంలో ఉద్యోగం చేస్తూ..తనకి నచ్చిన అమ్మాయిని పెళ్ళి చేసుకుని...తనని దాదాపు మర్చిపోయాడనే చెప్పాలి. మరి తనకి ఉత్తరం రాసిందెవరు?' ఆవిడకి ఆసక్తితో కూడిన ఉద్వేగం కలిగింది. గబ గబ లోపలికి వెళ్ళి గూట్లో వున్న కళ్ళజోడు తీసుకుని..వెలుగు లోకి వచ్చి కూర్చుని చదవడం మొదలెట్టారు. "పూజ్యురాలైన నానమ్మకి మీ మనవడు నిఖిల్ రాయునది-

నానమ్మా! నువ్వు ఎలా వున్నావు. నిన్ను చూసి చాలా కాలమయింది. నా చిన్నప్పుడు నువ్వు చాలాసార్లు మా ఇంటికి వచ్చేదానివట. ఇప్పుడు ఎందుకో మానేశావట. అమ్మ చెప్పింది. ఎందుకు? నన్ను చూడాలని అనిపించదా? మా ఫ్రెండ్స్ నాన్నమ్మలు వాళ్ళకి రకరకాల స్వీట్స్‌చేసి తినిపిస్తారట. కథలు కూడా చెబుతారట. మరి నువ్వెందుకూ దూరంగా వుంటావు. నన్ను చూడాలని అస్సలు అనిపించదా..నేనేమైనా తప్పుగా రాస్తే ఫర్‌గివ్‌మి. ఈమధ్య నాకు క్లాసులో లెటర్ రైటింగ్ నేర్పారు. ఎవరికైనా ఇష్టమైన వాళ్ళకి లెటర్ రాయమని మా టీచర్ చెప్పింది. అందుకే నేను నీకు రాశాను. నానమ్మా నన్ను చూడడానికి రావూ. ప్లీజ్.

మీ మనవడు నిఖిల్."

ఉత్తరం చదివిన వైదేహమ్మగారి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. మనవడు నిఖిల్ ఆవిడ మనసంతా నిండిపోయాడు. ఉత్తరంలోని అక్షరాలు తడుముతూ మనవడినే తృప్తిగా తడుముతున్నట్టుగా ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతోందావిడ. ఎన్నిసార్లు వాడిని చూడాలని అక్కడికి వెళదామనుకున్నా...గతంలో ఆవిడ పట్ల వాళ్ళ ప్రవర్తన గడపదాటనివ్వడం లేదు. గుండె రాయి చేసుకుని మోడులా బ్రతుకుతోంది. ఇప్పుడు మనవడి ఉత్తరం రూపంలో కాసిన్ని నీటి చుక్కలు పడ్డాయి.

లేచివెళ్ళి కలం కాగితం తెచ్చుకుని కొడుక్కి ఉత్తరం రాయసాగింది.

"చిరంజీవి శరత్‌కి!

మీరు క్షేమమని తలుస్తాను. నా మనవడు నాకు ఉత్తరం రాశాడు. ఉత్తరంలో వాడు రాసిన ప్రతి ప్రశ్నకి సమాధానం మీదగ్గరే ఉంది. అందుకే ఆ ఉత్తరాన్ని నీకు పంపిస్తున్నాను. వాడి ప్రశ్నలకి నిజాయితీగా సమాధానాలు చెప్పగలిగితే నీలో ఇంకా మానవత్వం మిగిలున్నట్టు. అది మనందరినీ మళ్ళీ దగ్గర చేస్తుంది. ఒకవేళ ఉత్తరం రాసినందుకు వాడిని నువ్వు తిట్టి-కొడితే, రేపు మీ పిల్లవాడికి మీరూ దూరమవుతారు. నేను శాపనార్థాలు పెట్టట్లేదు. చరిత్ర పునరావృత మవుతుందన్నది వాస్తవమని చెబుతున్నాను. నువ్వు తల్లిని మర్చిపోయినా నా మనవడు నన్ను గుర్తుంచుకున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది. నీలో నేను కోరుకుంటున్న మార్పు వస్తుందని ఆశిస్తూ..

వైదేహి"

**-ప్రతాప వెంకట సుబ్బారాయుడు**

(సికిందరాబాద్)